
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం, 29, సెప్టెంబర్, 2023



సోమశిలలో 26.343 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 26.343 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 9, 844 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.59,760
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,385
3శాతం జీఎస్టీతో	రూ.5,547
నవర (8గ్రా)	రూ.44,376

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.9 /27.0

గురువారం గాలిలో తేమ 64శాతంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వాతావరణం వేడిగా ఉంటుంది. మధ్యాహ్నం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వామినాథన్ మృతి తీరనిలోటు

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు (దర్గామిట్ట) : భారత హరిత విప్లవ పితామహుడు, దేశం గర్వించదగిన ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ స్వామినాథన్ మృతి దేశ వ్యవసాయ రంగానికి తీరనిలోటు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి కాకాణి గురువారం ఒక ప్రకటనలో స్వామినాథన్‌కు నివాళులర్పించారు. వ్యవసాయ రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకురావడమే కాకుండా అధిక దిగుబడిని ఇచ్చే వరి, గోధుమ వంగడాలను సృష్టించి ఆహార కొరత తీర్చిన మానవతావాది స్వామినాథన్ అని కొనియాడారు. వ్యవసాయ రంగంలో ఆయన కృషికి ఎన్నో అవార్డులు లభించాయని గుర్తుచేశారు. తన తుదిశ్వాస వరకు వ్యవసాయ రంగ అభివృద్ధికి పాటుపడిన స్వామినాథన్ కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'జగనన్నకు చెబుదాం'ను సద్వినియోగం చేసుకోవాలి



కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో ప్రతి బుధ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో అక్టోబర్ 4న లింగసముద్రం, 6న సీతారామపురం, 11న కలువాయి, 13న జలదంకి, 18న మర్రిపాడు, 20న మనుబోలు, 25న అల్లూరు, 27న కొడవలూరు మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలాధికారుల ముందస్తుగా కార్యక్రమంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలను పరిష్కరించుకునే విధంగా చూడాలని ఆదేశించారు.

లాభదాయకంగా పాడి పరిశ్రమ



మాట్లాడుతున్న విజయకుమార్

నెల్లూరు(సెంట్రల్): రైతులు మేలు జాతి పశుసంపదను వృద్ధి చేసుకోవడం ద్వారా పాడి పరిశ్రమను లాభదాయకంగా మార్చుకోవాలని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ సూచించారు. నెల్లూరులోని వెటర్నరీ పాలీక్లీనిక్‌లో లింగ నిర్ధారిత వీర్యం ప్రయోజనాలపై పాడి రైతులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాడి రైతులకు మేలుజాతి పెయ్య దూడలను అందించేందుకు లింగనిర్ధారిత వీర్యాన్ని రాయితీపై పంపిణీ చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కోటేశ్వరరావు మాట్లాడుతూ పెయ్య దూడల ఉత్పత్తి పథకం కింద జిల్లాలో 5,700 వీర్యనాళికలు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.


హృదయ వేదన



'హార్ట్ స్ట్రోక్, హార్ట్ ఎటాక్, కార్డియాక్ అరెస్ట్' వైద్య పరిభాషలో వాడే పదం ఏదైనా గుండె పోటు మనిషి ప్రాణాన్ని క్షణాల్లో హరిస్తుంది. మానవ శరీరంలో అన్ని భాగాలు ముఖ్యమైనవే అయినా.. గుండె అత్యంత కీలక అవయవం. ఇది పనిచేయడం మానేస్తే ప్రాణికి భూమిపై బతికే అవకాశమే ఉండదు. ఇంతటి విశిష్టత కలిగిన గుండెను పదిలంగా ఎలా కాపాడుకోవాలి.. సమస్యలొస్తే ఏం చేయాలి.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఓసారి దృష్టి సారిస్తే మంచిది. నేడు ప్రపంచ హృదయ దినోత్సవం (వరల్డ్ హార్ట్ డే) సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

- దడ పుట్టిస్తున్న హృద్రోగ సమస్యలు
- జిల్లాలో మూడు లక్షల మందికిపైగా వ్యాధిగ్రస్తులు
- మారుతున్న జీవనశైలే కారణం
- గుండె వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్న వైద్యులు



నెల్లూరు(బారకాసు): మనిషి ప్రాణాలను క్షణాల్లో హరించేది గుండెపోటు. గుండెకు సంబంధించిన సమస్యలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకే ముప్పు. అందుకే గుండెజబ్బు పేరు చెబితేనే మన గుండె గుభేలు మంటుంది. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే హృదయ సమస్యలు తలెత్తుతాయన్న విషయం చాలా మందికి తెలిసినా అశ్రద్ధ చూపుతుంటారు. ఫలితంగా గుండె వ్యాధులతో లెక్కకు మించిన మరణాలు నమోదవుతున్నాయి.

ఐఎంఏ లెక్కల ప్రకారం..

ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) లెక్కల ప్రకారం జిల్లాలో 28 లక్షలకుపైగా జనాభా ఉండగా, సుమారు మూడు లక్షల మంది గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. నిత్యం కనీసం ఆరుగురు చొప్పున నెలకు 180 మందికిపైగా మరణిస్తున్నారు. గుండె సమస్యలతో నిత్యం 700 మంది వైద్యులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో 16 మంది గుండె వైద్య నిపుణులు ఉండగా.. ఒక్కొక్కరూ రోజుకు కనీసం 40 మంది రోగులను ప్రాణాపాయం నుంచి రక్షిస్తున్నారు.

మారుతున్న జీవన విధానమే కారణం

గుండె వ్యాధులకు ప్రధానం కారణం మారుతున్న జీవన విధానమే. ఆహారపు అలవాట్లలో మార్పులు చోటు చేసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడంతో శరీరంలో కొలెస్ట్రాల్, షుగర్ శాతం ఎక్కువై గుండె పోటుకు గురవుతున్నారు. అలాగే ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లు గుండెను ప్రమాదంలో పడేస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

యువతలోనూ ప్రభావం

ఒకప్పుడు గుండె జబ్బులు 60 ఏళ్లు పైబడిన వారికే వచ్చేవి. కానీ ప్రస్తుతం 25 నుంచి 40 ఏళ్లలోపు వారు కూడా గుండె వ్యాధుల బారిన పడుతున్నారు. గర్భిణులు చేసే చిన్నతప్పిదాలు, తల్లిదండ్రుల అలవాట్లు, జన్యుపరమైన సమస్యలు, వాతావరణంలోని మార్పులు శిశువుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. గుండెలో రంధ్రాలు ఏర్పడడం, వాల్వులు మూసుకుపోయి సక్రమంగా రక్తం సరఫరా కాకపోవడం వంటి సమస్యలు పురిటి బిడ్డల్లోనే కనిపిస్తున్నాయి.

గ్రామీణుల్లోనూ..

గుండె జబ్బులు ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా నమోదయ్యేవి. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ గుండె రోగుల సంఖ్య ఎక్కువగానే ఉంది. ప్రతి వేయి మందిలో 20 మంది గుండె జబ్బులకు గురవుతుండగా, అందులో 8 మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు కావడం గమనార్హం. ప్రస్తుతం గ్రామాల్లోనూ శారీరక శ్రమ తగ్గిపోయి ఆధునిక పోకడలు చోటు చేసుకోవడమే ఇందుకు కారణమని వైద్యులు చెబుతున్నారు.

గోల్డెన్ అవర్ కీలకం..

ఛాతిలో నొప్పి ప్రారంభమైన ఒక గంట (గోల్డెన్ అవర్)లోనే అది గుండె పోటు అని గుర్తించగలిగితే ప్రాణాలు కాపాడొచ్చని వైద్యనిపుణులు చెబుతున్నారు. గుండెపోటు అనిపించిన వెంటనే రోగికి తగిన విశ్రాంతి ఇవ్వాలి. డిస్ప్రిన్ టాబ్లెట్‌ను నీళ్లలో కరిగించి తాగించాలి లేదా నమిలి మింగించాలి. ఐసార్డిల్ 5 మి.గ్రా మాత్రను నాలుక కింద ఉంచాలి. ఇలా చేస్తే 50 శాతం జబ్బును నయం చేసినట్టే. 22 శాతం మరణాలు తగ్గించొచ్చు. వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలించి ఈసీజీ తీయించడం ద్వారా ప్రాణాపాయాన్ని నివారించే అవకాశం ఉంది.

గుండె వ్యాధులు ఇలా...

గుండె వ్యాధులు అనేక రకాలుగా వచ్చే అవకాశం ఉంది. వాటిలో హార్ట్ ఎటాక్ ప్రధానమైంది. గుండెకు వెళ్లే రక్తనాడులు పూర్తిగా మూసుకుపోవడంతో గుండె ఆగిపోయే ప్రమాదం ఉంది. దీనికి స్టెంట్ వేయడం, బైపాస్ సర్జరీ చేయడం ద్వారా ప్రాణాలు కాపాడే అవకాశం ఉంది.

• కార్డియో మయోపతి (గుండె కండరాలు దెబ్బతినడం) సమస్యకు గుండె మార్పిడి శస్త్రచికిత్స ఒక్కటే మార్గం.

అందుబాటులో ఆధునిక వైద్య సేవలు

గత పదేళ్లతో పోలిస్తే గుండె జబ్బులు నయం చేసేందుకు ఇప్పుడు అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక, సాంకేతిక విధానాలతో వైద్యులు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. నెల్లూరులోని పలు ఆస్పత్రుల్లో అత్యంత అధునాతనమైన క్యాథ్‌ల్యాబ్ పరికరంతో శస్త్రచికిత్సలు, సిటీ, యాంజియో, టీఎంటీ వంటి పరీక్షల ద్వారా గుండె జబ్బులు ఏ స్థాయిలో ఉన్నాయో గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. గుండెకు వెళ్లే రక్తనాళాల్లో ఏవి మూసుకు పోయాయో గుర్తించి శుభ్రపరిచే విధానం అందుబాటులోకి వచ్చింది. తాజాగా గుండె రక్తనాళాలకు వేసే స్టంట్‌లు కూడా కాలక్రమంలో కరిగిపోయేవి అందుబాటులోకి రావడం శుభపరిణామం.

గుండె జబ్బులను నివారించకపోతే ప్రమాదమే



ప్రపంచంలో గుండె జబ్బుల మరణాల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మనదేశంలోనూ చిన్న వయసు వారికే వస్తున్నాయి. వాటిని నివారించకపోతే పెను ప్రమాదాలను మనదేశం ఎదుర్కోవాల్సి వస్తుంది. పొగాకు, మద్యపానం వంటి దురలవాట్లతో యువతపై గుండె వ్యాధుల ప్రభావం ఎక్కువగా ఉంది. బీపీ, షుగర్, కొవ్వులను అదుపులో ఉంచుకోవాలి. నిత్యం శారీరక శ్రమ, లేదా వ్యాయామం చేయడం, మంచి ఆహారపు అలవాట్లతో గుండె జబ్బులను నియంత్రించవచ్చు.

– డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డి, గుండె వ్యాధుల శస్త్రచికిత్స నిపుణుడు, అపోలో హాస్పిటల్.

బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలి



ప్రస్తుతం 30 నుంచి 40 ఏళ్లలోపు యువకులకే గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి. బీపీ, షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలి. పొగాకు, మద్యపానం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. జంక్ ఫుడ్‌ను తీసుకోకుండా రోజుకు నాలుగైదుసార్లు కూరగాయలు లేదా పండ్లు తినాలి. 40ఏళ్లు దాటిన వారు ముందస్తు జాగ్రత్తగా ఏడాదికి రెండు సార్లు కొలెస్టాల్ పరీక్ష చేయించుకోవడం మంచిది.

– డాక్టర్ సీఎస్ శ్రీనివాసరాజు, గుండె వ్యాధుల శస్త్రచికిత్స నిపుణుడు, కిమ్స్ హాస్పిటల్

గుండె వ్యాధులపై అప్రమత్తత అవసరం



గుండె వ్యాధులతో మరణించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రతిఒక్కరూ గుండె వ్యాధులపై పూర్తిగా అవగాహన పెంపొందించుకోవాలి. గుండె పనితీరును ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. కొవ్వు పదార్థాలు తగ్గించి ఆకు కూరలు, పండ్లు తినడం ద్వారా గుండె పనితీరును సక్రమంగా ఉంచుకోవచ్చు. రోజూ వ్యాయామాలు చేయడం ద్వారా గుండెపై ఒత్తిడిని నివారించవచ్చు.

–డాక్టర్ నాగేంద్రప్రసాద్ యాదవ్, కార్డియాలజిస్ట్, ఎండీ, ఎనెల్ హాస్పిటల్స్

శరవేగంగా పోర్టు నిర్మాణ పనులు





బెర్త్ పనులను పరిశీలిస్తున్న పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ హరినారాయణన్

• రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్ పేర్కొన్నారు. గురువారం ఆయన కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి రామాయపట్నం పోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. సౌత్ బ్రేక్ వాటర్‌లో జరుగుతున్న మొదటి బెర్త్ నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోర్టు కార్యాలయంలో మౌలిక వసతుల కల్పన, భూసేకరణ, పోర్టు నిర్మాణ పనుల ప్రగతిపై రెవెన్యూ, పోర్టు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ పోర్టు నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని, పనుల ప్రగతి చాలా బాగుందన్నారు. మొదటి ఓడ పోర్టులోకి రావడానికి వీలుగా డ్రెడ్జింగ్ పనులు, బెర్త్ నిర్మాణంతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని పోర్టు అధికారులకు సూచించారు. పోర్టు పరిసర ప్రాంతాల భౌగోళిక స్థితిగతులపై ఆరా తీశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం అన్ని రకాల అనుమతులు ఉన్నాయా..లేవా..అని పరిశీలించుకోవాలన్నారు. పోర్టుకు అవసరమైన రహదారులు, రైల్వే లైన్లు, కస్టమ్స్ బిల్డింగులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పోర్టుకు అనుబంధంగా నిర్మిస్తున్న పరిశ్రమలకు అవసరమైన భూసేకరణ పనులు కూడా వేగవంతం చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ శోభిక, పోర్టు ఎంపీ ప్రతాప్‌రెడ్డి, భూసేకరణ ప్రత్యేకాధికారి పద్మావతి, పరిశ్రమల జేడీ సుధాకర్, పోర్టు జనరల్ మేనేజర్ శేషుకుమార్, సుధాకర్‌రావు, లైజనింగ్ అధికారి ఐవీరెడ్డి, తహసీల్దార్ సూర్యనారాయణసింగ్, సేఫ్టీ మేనేజర్ పోలారావు, చెంచిరెడ్డి, తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

సంగం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఏఎస్పీ హిమవతితో కలిసి సంగం పోలీస్ స్టేషన్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులను త్వరగా పరి ష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి రూ.10 వేలు జరిమానా విధిస్తున్నామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి నివారణకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో చికెన్ వ్యర్థాల నివారణకు మత్స్యశాఖ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. మొబైల్ హంట్ ద్వారా అనేక ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. మొబైల్ హంట్‌పై అవగాహనకు ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ వెంట ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, సంగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, ఎస్సై నాగార్జున్‌రెడ్డి ఉన్నారు.

నీచ రాజకీయాలు నా నైజం కాదు



28వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: తాను ఎక్కడి నుంచి ప్రజాప్రతినిధిగా ప్రాతినిధ్యం వహించినా అభివృద్ధి చేయడమే తప్ప నీచ రాజకీయాలు తన నైజం కాదని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 28వ డివిజన్ పోస్టల్‌కాలనీ 3వ వీధిలో డ్రెయిన్ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ పాటుపడుతానన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 28వ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. మరో రూ.75 లక్షల మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కుల,మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరిస్తున్నారన్నారు. అవినీతికి ఏ మాత్రం తావులేకుండా ప్రజల వద్దకే సేవలు అందుతున్నాయన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనని చెప్పారు. ప్రతిపక్ష పార్టీల విమర్శల్లో వాస్తవాలు ఏ మాత్రం లేవన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని కోరారు. మేయర్ స్రవంతి, విజయ డైయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 28వ డివిజన్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు,నగర పాలక సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ



ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా మదీనా నమూనా



నెల్లూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

మొహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్–ఉన్–నబీ పర్వదినాన్ని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నెల్లూరు నగరంలోని కోటమిట్టలోని యూసుఫియా మసీదు నుంచి ముస్లింలు ప్రదర్శన (జులుస్) నిర్వహించారు. మసీదు ఇమామ్ హఫీజ్ షకీల్ ఆధ్వర్యంలో మతపెద్దలు, ఇమామ్‌లు, మౌల్వీలు ఎండీ దస్తగిరి, హఫీజ్ ముస్తాఖ్, షేక్ ఇస్మాయిల్‌ఖాదరి, జనాబ్ సిద్దిఖ్ సంప్రదాయంగా దువా చేశారు. మొహ్మద్ ప్రవక్త బోధనలు వివరించారు. అల్లాహ్ చూపిన సన్మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని సందేశం ఇచ్చారు.

–నెల్లూరు(బృందావనం)



మిలాద్-ఉన్ -నబీ సందేశాన్ని ఇస్తున్న ముస్లిం మతపెద్ద

తొందరపడి నార్లు పోయొద్దు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలోని రైతులు తొందరపడి నార్లు పోయవద్దని ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం సోమశిల రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజ్‌ని మినహాయించి కేవలం 18 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ నీరు తాగునీటి అవసరాలకు సరిపోతాయని అంచనా వేసినందున రైతులు సంయమనం పాటించాలన్నారు. ఈశాన్య రుతుపవనాలతో రాబోయే నెలలో సోమశిల రిజర్వాయర్‌లో పెరిగే నీటి పరిమాణాన్ని దృష్టిలో ఉంచుకుని సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహిస్తామన్నారు. ఆ సమావేశంలో తొలికారు పంటకు ఎంత మేరకు ఆయకట్టుకు సాగునీరు అందించగలమో నిర్ణయిస్తామని, అప్పటి వరకు రైతులు సంయమనం పాటించాలని కోరారు.

2న ఖోఖో జట్ల ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఖోఖో జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలను అక్టోబర్ 2న నిర్వహించనున్నట్లు జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ గిరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉదయం 9గంటలకు బాలికల, మధ్యాహ్నం 3 గంటలకు బాలుర ఎంపికలు జరుగుతాయని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 20 నుంచి చిత్తూరు జిల్లా మదిమరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 94931 92699, 94940 02341 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఇందుకూరుపేట : మండలంలోని రాముడుపాళెం గ్రామంలో ఓ వ్యక్తి గురువారం అనుమానాస్పదంగా మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. రాముడుపాళెం దళితవాడకు చెందిన మునునూరు వెంకటరమణయ్య(35) ఓ రొయ్యలసాగు రైతు వద్ద కూలిపనికి వెళ్లాడు. బస్తాలను తరలించే క్రమంలో కట్టపై నుంచి రొయ్యల గుంతలోకి పడిపోయాడు. అక్కడే ఉన్న మరో వ్యక్తి వెంకట రమణయ్య బహిర్భూమికి వెళ్లి ఉంటాడని భావించాడు. కొంతసేపటికి వెంకట రమణయ్య విగతజీవిగా నీటిపై తేలియాడుతూ కనిపించాడు. అప్పటివరకు తమతోనే ఉన్న వ్యక్తి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దీంతో రాముడుపాళెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా వెంకట రమణయ్యకు ఫిట్స్ వ్యాధి ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా.. కాలుజారి గుంతలో పడిపోయాడా లేదా విద్యుత్ ప్రమాదం ఏమైనా జరిగిందా అనే విషయాలు తెలియరావాల్సి ఉంది. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.

ఆదోనిలో చంద్రశేఖరపురం వాసి మృతి

ఆదోని అర్బన్ : పట్టణ శివారులోని జగనన్న కాలనీలో వెల్డర్‌గా పనిచేస్తున్న నెల్లూరు జిల్లా చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన ముత్తు(49) అనుమానాస్పద స్థితిలో గురువారం మృతిచెందారు. స్పృహ లేకుండా పడి ఉన్న ముత్తును తోటి సిబ్బంది గమనించి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. వెల్డర్ పనులు చేస్తున్నప్పుడు విద్యుదాఘాతానికి గురయ్యాడా, లేక గుండెపోటుతో మృతిచెందాడా అనే విషయాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

10.5 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాద్

నాయుడుపేట టౌన్ : ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఇద్దరు వ్యక్తులు రెండు బ్యాగుల్లో గంజాయి నింపుకుని అక్రమంగా తరలిస్తుండగా నాయుడుపేట ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.2 లక్షలకు పైగా విలువ చేసే 10.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో ఇద్దరు నిందితులను గురువారం హాజరుపరిచి వివరాలను వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రం, బెంగళూరు పట్టణానికి చెందిన ఎస్.చేతన్, ఎం.సైపుల్లా, సుధాకర్ జల్సాలకు అలవాటుపడి గత రెండేళ్ల నుంచి వైజాగ్ నుంచి గంజాయి అక్రమ రవాణా చేస్తూ బెంగళూరుకు తీసుకెళ్లి విక్రయాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో చేతన్, సైపుల్లా వైజాగ్‌కు వెళ్లి అక్కడ ఓ వ్యక్తిని కలిసి అతని వద్ద 10 కేజీలకు పైగా గంజాయి కొనుగోలు చేశారు. రెండు బ్యాగుల్లో నింపుకుని వైజాగ్ నుంచి విజయవాడకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ఓజిలి క్రాస్ రోడ్డు వద్ద వస్తుండగా గురువారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. వారివద్ద ఉన్న గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఈబీ ఎస్సై ఒ.ప్రతాప్‌కుమార్, పోలీసులు పి.వెంకటేశ్వర్లు, శ్రీరాములు, రాజయ్య, డి.వెంకటేశ్వర్లు, రాజయ్య, గోపాల్, కృష్ణ, రమణయ్య పాల్గొన్నారు.

కండలేరులో 11.861 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో గురువారం నాటికి 11.861 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 605 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిజ్‌కు 30 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి గ్రామోత్సవం

చిట్టమూరు : మల్లాం గ్రామంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు, నిత్యకైంకర్యాలు జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు సుగంధభరిత పుష్పాలతో విశేషాలంకరణ చేసి, గ్రామోత్సవం చేశారు. గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శోభాయమానంగా తీర్చిదిద్దిన విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. శుక్రవారం స్వామివారికి ఫలాభిషేకం, నందిసేవ, మల్లాసుర, కొల్లాసుర యుద్ధం తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సాయికుమార్‌రెడ్డి తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.70
సన్నవి	: రూ.30
పండ్లు	: రూ. 8

రాష్ట్రానికే తలమానికం.. ఆర్‌ఓఆర్ వంతెన

విజయవాడ- చెన్నై, విజయవాడ- రేణిగుంట మధ్య రైళ్ల రాకపోకలకు అంతరాయాలు లేకుండా దక్షిణమధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా విజయవాడ-గూడూరు మధ్య మూడో రైల్వేలైన్ నిర్మిస్తుండగా ఇందులో కీలకమైనది మనుబోలు-గూడూరు మధ్య నిర్మించిన రైల్ ఓవర్ రైల్(ఆర్‌ఓఆర్) వంతెన. ఇది కేవలం మూడో లైన్ కోసమే కాకుండా వరదల సమయాల్లో వర్షపునీరు ట్రాక్‌పై వచ్చినప్పుడు రైళ్ల రాకపోకలకు అంతరాయాలు లేకుండా ఉండేలా దీనిని నిర్మించారు. అంతే కాకుండా దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అతి పొడవైన ఆర్‌ఓఆర్ వంతెన ఇదే కావడం విశేషం.

మనుబోలు-గూడూరు మధ్య ఎస్ టైప్ బ్రిడ్జి
- పంబలేరుపై నిర్మాణం
- సులభతరంగా రైళ్ల రాకపోకలు



ఆర్‌ఓఆర్ వంతెన

మనుబోలు : మనుబోలు–గూడూరు మధ్య మూడో రైల్వేలైన్ పనుల్లో భాగంగా అతిపొడవైన ఆర్‌ఓఆర్ వంతెనను గూడూరు సమీపంలోని పంబలేరు నదిపై రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్) నిర్మించి ఇటీవల ప్రారంభించింది. మనుబోలు గూడూరు రైల్వేస్టేషన్‌ల మధ్య 8 కాలువలు, ఏర్లు ఉన్నాయి. వీటిలో గూడూరు సమీపంలో ఉన్న పంబలేరు నది పెద్దది. దీంతో పాటు సమీపంలోని కొన్ని కాలువలను కలుపుకుని 2.2 కిలోమీటర్ల దూరంతో అతి పొడవైన రైల్ ఓవర్ రైల్ వంతెనను నిర్మించారు. గతంలో భారీ వరదలు, తుపాన్‌ల సమయంలో రైల్వే ట్రాక్‌కు తూర్పు, పడమటి వైపులకు రాకపోకలు సాగించాలంటే వీలయ్యేది కాదు. ప్రస్తుతం 2 కిలోమీటర్లకు పైగా పొడవుతో భారీ వంతెన ఏర్పాటు కావడంతో వరదల సమయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటి ప్రవాహం సాగిపోతుంది. దక్షిణ మధ్య రైల్వే తన రైలు నెట్‌వర్క్ పరిధిలోని రైళ్ల రాకపోకలను సులభతరం చేయడానికి మౌలిక సదుపాయాలను నిరంతరం అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగా విజయవాడ డివిజన్‌లోని గూడూరు-మనుబోలు స్టేషన్‌ల మధ్య రైల్ ఓవర్ రైల్(ఆర్‌ఓఆర్) వంతెనను నిర్మించారు. 2.2 కిలోమీటర్లతో నిర్మించిన ఈ రైల్ వంతెన దక్షిణ మధ్య రైల్వేలో ఏడో ఆర్‌ఓఆర్‌గా నిలిచిందని రైల్వే అధికారులంటున్నారు. జోన్‌లో అతి పొడవైన ఆర్‌ఓఆర్ కూడా ఇదేనని తెలిపారు. గతంలో అతి పొడవైన ఆర్‌ఓఆర్ వంతెన 40 మీటర్లు మాత్రమే ఉండేదని వారు అంటున్నారు. ఈ వంతెన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేవలం ఏడాదిన్నర కాలంలో పూర్తి చేశారు. దీని నిర్మాణంలో హైగ్రేడ్ కాంక్రీట్, స్ట్రక్చరల్ స్టీల్‌ను ఉపయోగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ సింగిల్ లైన్ వంతెన రెండు దిశలలో రైళ్ల కదలికల కోసం రూపొందించబడింది. 32.5 టన్నుల యాక్సిల్ లోడ్‌తో రైళ్లను సజావుగా నడిపే సామర్థ్యంతో నిర్మింపబడింది. నిరంతరం రైళ్ల రద్దీ అధికంగా ఉండే ఈ ప్రాంతంలో రాకపోకలను సులభతరం చేయడానికి ఈ ఫ్లై ఓవర్ ఉపకరిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ వంతెన వల్ల గూడూరు స్టేషన్ మీదుగా విజయవాడ నుంచి రేణిగుంట, చెన్నై మధ్య ఏకకాలంలో నడిచే రైళ్ల రాకపోకలు సులభతరమవుతాయి.



కొత్తగా నిర్మించిన మూడో లైన్

ప్రాజెక్ట్ వ్యయం - రూ.160 కోట్లు	దూరం - 2.2 కిలోమీటర్లు
నిర్మాణ కాలం - ఏడాదిన్నర	

చాలెంజ్‌గా తీసుకుని నిర్మించాం



రైలు మార్గంలో భౌగోళిక పరిస్థితులు, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని రైల్ ఓవర్ రైల్ వంతెనలను చాలా అరుదుగా ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాంతంలో వరద ఉధృతిని పరిగణనలోకి తీసుకుని మనుబోలు-గూడూరు మధ్య ఎస్ కర్వ్ ఆర్‌ఓఆర్ వంతెన నిర్మాణాన్ని చాలెంజ్‌గా తీసుకున్నాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి రూ.160 కోట్ల వ్యయంతో కేవలం ఏడాదిన్నర కాలంలో పూర్తి చేశాం.

– జాకీర్, ప్రాజెక్ట్ మేనేజర్, ఆర్‌వీఎన్‌ఎల్

రైతులకు ఎంతో ఉపయోగం



ఇలాంటి వంతెన మా ప్రాంతంలో నిర్మించడం కొత్తగా వింతగా ఉంది. ఈ తరహా వంతెన వల్ల రైల్వే ట్రాక్‌కు అటు ఇటుగా ఉండే వ్యవసాయ భూమి వృథా కాదు. వరదల సమయంలో సాఫీగా నీరు వెళ్లే మార్గం ఏర్పడడంతో ఎగువ ప్రాంతంలో వ్యవసాయ పొలాలు మునిగిపోకుండా ఉంటాయి. పశువులు రైలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉండదు. మొత్తంగా ఈ వంతెన రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– బి.హరగోపాల్‌రెడ్డి, రైతు, మనుబోలు

రైల్ వంతెనతో ఎన్నో ఉపయోగాలు

గ్రాండ్‌ట్రంక్ రూట్‌లో ఉన్న గూడూరు జంక్షన్ ఇంటర్ చేంజ్ పాయింట్ కావడంతో ఈ రకమైన వంతెన ఇక్కడ ఎంతో అవసరం. ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడంతో పాటు రద్దీగా ఉండే గూడూరు స్టేషన్ వద్ద రైళ్లు వేచి ఉండే సమయాన్ని ఈ వంతెన ఎంతగానో తగ్గిస్తుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వంతెనను నిర్మించిన ఆర్‌వీఎన్‌ఎల్ అధికారులకు అభినందనలు.

– అరుణ్‌కుమార్ జైన్, జనరల్ మేనేజర్, దక్షిణమధ్య రైల్వే

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు

రాపూరు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్వామివారికి హోమాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. తొలుత అలంకార మండపంలో లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను శేషవాహనంపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలు, పవిత్రాలను అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాల నడుమ అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. వేద దివ్య ప్రబంధ పారాయణం, హోమం, నివేదన, శాత్తుమొర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి మాట్లాడుతూ దేవస్థానంలో సకలదోష నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. స్వామివారి పవిత్రోత్సవాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.



హోమం జరిపిస్తున్న అర్చకులు



శేషవాహనంపై కొలువైన స్వామి, అమ్మవార్లు



శ్రీవారికి క్షేత్రోత్సవం

పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను తిరుచ్చిపై కొలువుతీర్చి వివిధ పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి కోన మాడవీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



క్షేత్రోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఆటో బోల్తా

దొరవారిసత్రం : ముందు వెళ్తున్న లారీని అధిగమించే క్రమంలో లారీ వెనుక భాగంలోని గొలుసులు తగులుకోవడంతో ఓ ఆటో బోల్తాపడి నుజ్జునుజ్జు అయిన ఘటన కలుగుంట సమీపంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కొత్తపల్లెకు చెందిన ఆటో నాయుడుపేటకు వెళ్లి సిమెంట్ బస్తాలు వేసుకుని తిరిగి కొత్తపల్లెకు బయలుదేరింది. ఈ క్రమంలో కలుగుంట సమీపంలో జాతీయ రహదారి మరమ్మతులు జరుగుతుండడంతో వాహన రాకపోకలను ఒకేవైపు అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న లారీని అధిగమించే ప్రయత్నంలో ఆటోకు లారీ వెనుకన ఉన్న గొలుసులు తగులుకున్నాయి. దీంతో ఆటో బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ఉన్న డ్రైవర్ పీరయ్యతో పాటు ముగ్గురు ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 117
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 195

టీడీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు



అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

- స్కామ్‌పై అసెంబ్లీలో చర్చకు రమ్మంటే పరారైన టీడీపీ ఎమ్మెల్యేలు
- నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ అన్నారు. నెల్లూరు నగరంలోని మూడో డివిజన్‌లో ఉన్న సింహపురి కాలనీ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే అనిల్ గురువారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి 90 శాతం సీమెన్స్ పెడితే, 10 శాతం ప్రభుత్వం పెట్టాలన్నారు. కానీ ఒక్క రూపాయి కూడా పెట్టకుండా నేరుగా వందల కోట్లు బ్యాంకుల్లో వేసుకుని పంచుకున్న కేసులో చంద్రబాబునాయుడు తప్పు చేశారని స్పష్టమైన ఆధారాలున్నాయని న్యాయస్థానం చెబుతోందన్నారు. తండ్రి లోపలుంటే ఆయన కుమారుడు రాష్ట్రంలో ముఖం చూపించకుండా ఢిల్లీలో తిరుగుతూ రోజుకు నలుగురితో ఫొటోలు దిగి మీడియాకు పంపించడం, ఎంపీలతో చర్చిస్తున్నానని చెబుతుండడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఈ వయసులో అరెస్టు చేయడం బాగదాలేదని చంద్రబాబు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అదే వయసులో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ని మనోవేదనకు గురిచేసి ఆయన మృతికి కారణమైన విషయం మరిచిపోయినట్లున్నారన్నారు. ఎవరి అకౌంట్ నుంచి ఎవరెవరి అకౌంట్లకు నగదు మారాయో అసెంబ్లీలో చర్చకు రమ్మంటే అక్కడి నుంచి టీడీపీ ఎమ్మెల్యేలు పరారయ్యారన్నారు.

జిల్లాలో వలస నేతల హడావుడి

తెలుగుదేశం పార్టీ నేతలు చంద్రబాబు చేసిన తప్పులను అర్థం చేసుకున్నారని, కానీ జిల్లాలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన వలస నేతలు మాత్రం హడావుడి చేస్తూ, పుట్టినప్పటి నుంచి చంద్రబాబు కోసం పోరాటాలు చేస్తున్నట్లు, టీడీపీని వారే మోస్తున్నట్లు మాట్లాడుతుండడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే అనిల్ అన్నారు. టీడీపీ నాయకులే కాసేపు నిరసనలు తెలిపి ఏదో మాట్లాడి వెళ్లిపోతున్నా వలస నేతలు ఎందుకు హడావుడి చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. చంద్రబాబుకు 23 అంకె బాగా కలిసొచ్చినట్లుందన్నారు. గత ప్రభుత్వంలో తమ 23 మంది ఎమ్మెల్యేలను తీసుకోగా, 2019 ఎన్నికల్లో 23 మంది మాత్రమే టీడీపీ తరఫున గెలవడం, ఆయన్ను అరెస్టు చేసిన తేదీ 23, ఆయనకు రాజమహేంద్రవరం జైల్లో ఇచ్చిన సంఖ్య కూడితే 23 వచ్చిందని, ఇదంతా చూస్తుంటే దేవుని స్క్రిప్ట్‌లాగా ఉందన్నారు. చేసిన పాపం ఊరికే పోదన్నారు. ఈ స్కామ్‌కు సంబంధించి నెల్లూరులో ఒకరు పెద్దమనిషి ముసుగులో ఉన్నారని, వారు కూడా లోపలికి వెళ్లే రోజులు దగ్గర పడిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంక్రాంతి అశ్విని, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా పండగగా వెంకటగిరి జాతర



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పోలేరమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండగ హోదాలో ఈ ఏడాది ప్రజల పండగగా నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జాతరకు సంబంధించి 28 మందితో పీస్ కమిటీని తొలిసారిగా ఏర్పాటు చేసి ఆ సభ్యులతో జాతర నిర్వహణపై గురువారం సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరకు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వెంకటగిరి రాజ కుటుంబీకులు, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ. సాయికృష్ణ యాచేంద్ర సూచనలు, సలహాలు పాటిస్తూ సంప్రదాయాన్ని గౌరవిస్తూ మరింత వైభవంగా జాతరను నిర్వహిస్తామన్నారు. అమ్మవారి దర్శనార్థం రూ.200, 500తో ప్రత్యేక క్యూ లైన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పోలేరమ్మతల్లి దేవస్థానం మాజీ చైర్మన్ పులి ప్రసాద్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.